నమస్తే తెలంగాణ

నిర్మల్

5 | నిజామాబాద్, గురువారం 28 డిసెంబర్ 2023 | NIRMAL


## జేఎన్-1 వైరస్‌తో అప్రమత్తం

నిర్మల్ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాట్లు


నిర్మల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బెడ్లు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 27 : రాష్ట్రంలో జేఎన్–1 వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో నిర్మల్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందుకోసం బెడ్లు, ఆక్సిజన్, వైద్య సదుపాయాలకు ముందస్తు చర్యలు చేపట్టారు. నిర్మల్ జనరల్ ఆస్పత్రి భవనంలోని పైఅంతస్తులో 117 బెడ్లను సిద్ధం చేశారు. ఐసీయూ విభాగంలో ఐదు వెంటిలేటర్లు, వెంటిలేటర్లు లేకుండా మరో ఐదు బెడ్లు సిద్ధంగా ఉంచారు. 107 బెడ్లకు ఆక్సిజన్ అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు కొవిడ్ కేసులు నమోదు కాలేదని, ఆక్సిజన్ ప్లాంటు మరమ్మతులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని నిర్మల్ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు.

## మెస్రం నాగోరావ్ మృతి

- నాగోబా చరిత్రపై సన్నాయితో పాటలు పాడడంలో దిట్ట
- ఆయన మృతి మెస్రం వంశీయులకు తీరనిలోటు


మెస్రం నాగో రావ్(ఫైల్)

ఇంద్రవెల్లి, డిసెంబర్ 27 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్ నాగోబా జాతరతోపాటు మహాపూజల ప్రారంభం నుంచి చరిత్రపై సన్నాయి వాయిస్తూ పాటల రూపంలో వివరించే మెస్రం నాగోరావ్(75) మృతిచెందారు. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన నాగోరావ్ వయసు మీద పడడం, కొన్ని రోజులుగా కాళ్లు, కీళ్ల నొప్పులతో యేడాది కాలంగా బాధపడుతున్నాడు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకున్నా కోలుకోలేదు. మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మెస్రం వంశీయులతోపాటు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నాగోబా జాతర ప్రారంభం నుంచి ముగిసే వరకు మెస్రం వంశీయులతోపాటు నాగోబా సన్నిధిలో భేటింగ్ అయిన కొత్త కోడళ్లకు నాగోబా చరిత్రను సన్నాయి వాయిస్తూ పాటల రూపంలో వివరించేవారు. మెస్రం నాగోరావ్ మృతి మెస్రం వంశీయులకు తీరనిలోటని పలువురు పేర్కొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయాలి..


బాసర పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

బాసర, డిసెంబర్ 27 : ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయాలని నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. బుధవారం బాసర పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఠాణా ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ముథోల్ సీఐ వినోద్‌రెడ్డితోపాటు బాసర ఎస్సై గణేశ్, ఏఎస్సై లక్ష్మణ్, ఉజ్వలను అభినందించారు. క్రైమ్‌రేట్ పెరగకుండా చర్యలు తీసుకోవాలని, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీగా ఉండాలన్నారు.

### ఆయకట్టుకు రైతులకు భరోసా

**- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి**

సోన్, డిసెంబర్ 27 ః శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీటిని అందిస్తామని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గాంధీనగర్ వద్ద గల ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 77 టీఎంసీఎంల నీరు ఉండడంతో సోన్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్ మండలాల్లోని 36 వేల ఎకరాలకు నీరు అందిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### చిరుత దాడిలో ఆవు మృతి

గుడిహత్నూర్, డిసెంబర్ 27 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ధమన్‌గూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆవుపై చిరుత దాడి చేసిన ఘటన కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ధమన్‌గూడ గ్రామానికి చెందిన మానేరు కృష్ణ తన ఆరు ఆవులను బుధవారం ఉదయం మేత కోసం వదిలిపెట్టాడు. ఇవీ సమీప అటవీ ప్రాంతంలో మేస్తుండగా చిరుత దాడి చేసింది. కృష్ణ సాయంత్రం వెళ్లి చూడగా ఆవు మృతి చెంది ఉంది. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా పరిశీలించారు. చిరుత దాడిలో మృతి చెందిందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భూమన్న ధ్రువీకరించారు. కాగా.. వారం రోజులుగా చిరుత సంచరిస్తున్నదనే సమాచారాన్ని అధికారులకు ఇచ్చినా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

# ప్రజా సంక్షేమానికి ఆరు గ్యారెంటీలు

- అర్హులందరికీ పంపిణీ చేస్తాం.. • ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నదని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి రాష్ట్రంలో ఆదర్శవంతమైన మార్పును తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచించారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ప్రజాపాలన, ఆరు గ్యారెంటీల అమలుపై ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ అందేలా చూడాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేసి.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా పథకాలను అర్హులకు వర్తింప చేయాలని సూచించారు. నేటి(గురువారం) నుంచి జనవరి 6వ తేదీ వరకు మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంత్రి సూచించారు. గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన హైమన్‌డార్ఫ్ వర్ధంతిని జనవరి 11వ తేదీన అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. విద్య, వైద్యం, సంక్షేమం, రవాణా రంగాలు మెరుగుపర్చడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గిరిజనులకు పోష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి ప్రజాపాలన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, ఖానాపూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, గడ్డం వినోద్.. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్‌లు రాథోడ్ జనార్దన్, విజయలక్ష్మి, కృష్ణారావు.. మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### కౌలు రైతు ఆత్మహత్య

బోథ్, డిసెంబర్ 27: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి చెందిన కౌలు రైతు ఆత్రం శ్రీనివాస్ (23) పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఆ భూమిలో వేసిన పత్తి పంట ఆశించిన దిగుబడి రాకపోవడంతో మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ దవాఖానాకు తరలించగా. అప్పటికే మృతి చెందాడు. సోదరుడు ఆత్రం భీంరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.


### పాదరక్షలు లేకుండా అయోధ్యకు పాదయాత్ర

కుభీర్, డిసెంబర్ 27 : కుభీర్ మండలం నుంచి అయోధ్య రామాలయానికి కాలినడకన వెళ్తున్న జాదవ్ మాధవ్‌రావు బుధవారం శ్రీవిఠలేశ్వరాలయంలో సన్మానించారు. దాదాపు 1,200 కిలోమీటర్లు పాదరక్షలు లేకుండా నడిచి వెళ్లడం సాహసోపేతమని పేర్కొన్నాడు. యువకుడు చిన్నప్పటి నుంచి పాదరక్షలు ధరించడం లేదు. సన్మానించిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ పర్శరాం, సర్పంచ్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ఉన్నారు.

## దరఖాస్తులెట్లా..

**పంపిణీ కాని ఫారాలు.. ఆందోళనలో ప్రజలు..**

- ఒక రోజు ముందే అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నేటి నుంచి ఆరు గ్యారెంటీల అర్జీల స్వీకరణ
- ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించనున్న మంత్రి సీతక్క




ఆదిలాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రజాపాలన పేరిట నేటి(గురువారం) నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో అధికారులు పర్యటించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజాపాలన కార్యక్రమంపై సలహాలు అందించారు.

### అందని దరఖాస్తులు

నేటి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుంది. మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15 వేలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకంలో భాగంగా రూ.40 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ కోసం అర్హులు దరఖాస్తులు సమర్పించాలి. ప్రతి గ్రామంలో అధికారులు 100 మందికి ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తారు. నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుండగా.. బుధవారం రాత్రి వరకు కూడా అప్లికేషన్ ఫారాలు అందకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తుదారులు తమ ఆధార్, తెల్లరేషన్ కార్డు జతపర్చాలని అధికారులు సూచిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండకపోవడంతో రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. చాలా మంది అర్హులు తెల్ల రేషన్‌కార్డు లేకపోవడంతో ఎలా దరఖాస్తు చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఒకే దరఖాస్తులో ఐదు పథకాల వివరాలు నమోదు చేయాలని అధికారులు సూచిస్తుండడం ప్రజల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని జామ్నిలో నేడు(గురువారం) జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరుకానున్నారు.

# ప్రజల గొంతుకై నిలబడదాం..

**నాయకులు, కార్యకర్తలు సమస్యల సాధనకు పాటుపడాలి..**

- ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి..
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న
- ఆదిలాబాద్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం




సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 27 : ప్రతి బీఆర్‌ఎస్ నాయకుడు, కార్యకర్త ప్రజల గొంతుకై నిలబడాలని, సమస్యల సాధనకు పాటు పడాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైతే ప్రజల గొంతుకగా నిలబడాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఎన్నికల్లో నైతికంగా ఓడిపోలేదని, పదివేల కంటే తక్కువ మెజార్టీతో కేవలం పది మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులు మాత్రమే ఓడారన్నారు. ప్రజలకు తమపై ఉన్న విశ్వాసాన్ని ఓట్ల రూపంలో చూపించారని స్పష్టం చేశారు. కార్యకర్తలు నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ప్రజలకు అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జాహిర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాజీ జడ్పీటీసీ అశోక్, మహిళ పట్టణ అధ్యక్షురాలు స్వరూపరాణి, కార్యదర్శి బొడగం మమత, నాయకులు సాజిజొద్దీన్, రాజేశ్వర్, లింగారెడ్డి, సలీం, కరుణ తదితరులు పాల్గొన్నారు.


ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు, రైతులు

## ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు..

- పనులు నిలిపివేసే వరకు ఉద్యమం చేస్తాం..
- దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లికి చెందిన రైతులు, మహిళలు
- ఎన్‌హెచ్-61పై బైఠాయించి నిరసన • రెండు గంటలపాటు రాస్తారోకో
- నిలిచిన వాహనాలు • తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

దిలావర్‌పూర్, డిసెంబర్ 27 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ బుధవారం మహిళలు, రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. గుండంపల్లి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక్కరు చొప్పున తరలివచ్చి జాతీయ రహదారి–61పై బైఠాయించారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. పరిశ్రమ ఏర్పాటుతో పంట భూములు దెబ్బతింటాయని, కలెక్టర్ వచ్చేంత వరకు ఆందోళన విరమించమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న నిర్మల్ పోలీసులు ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. ధర్నాను విరమించాలని నచ్చజెప్పారు. కొంతసేపు రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు తహసీల్దార్ స్రవంతికి సమాచారం అందించారు. ఆమె విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### ఆందోళన కొనసాగిస్తాం..

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమపై ఇథనాల్ పరిశ్రమ కుంపటి పెట్టిందని మండిపడ్డారు. పంట భూములు బీడుగా మారుతాయని ఆవేదన చెందారు. పరిశ్రమను రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కలెక్టర్ పరిశ్రమ పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటుపై ఉన్న ప్రేమ పోలీసులకు రైతులపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమకే పోలీసులు బందోబస్తు కల్పిస్తున్నారని ఆరోపించారు.

# ఓటెత్తిన కార్మికులు

**సింగరేణిలో ముగిసిన 'గుర్తింపు' ఎన్నికలు**

- మూడు ఏరియాల్లో 92 శాతానికి మించి పోలింగ్ • అర్ధరాత్రి వరకూ కొనసాగిన కౌంటింగ్ • ఆఖరి ఫలితం శ్రీరాంపూర్‌దే..


ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న సింగరేణి కార్మికులు

**జిల్లాలోని మూడు ఏరియాల్లో పోలింగ్ శాతం...**

| ఏరియా | పోలింగ్ శాతం |
|---|---|
| శ్రీరాంపూర్ | 93.0 |
| మందమర్రి | 96.3 |
| బెల్లంపల్లి | 93.4 |


రెబ్బెన: గోలేటి పీఎంఈ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జీఎం కార్యాలయ క్లర్క్‌లు

మంచిర్యాల, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఓటెత్తారు. వాయిదాలు, కోర్టు తీర్పుల తర్జనభర్జనల మధ్య ప్రశాంత వాతావరణంలో ఏడో దఫా ఎన్నికలు జరిగాయి. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్లలో బ్యాలెట్ బాక్సులను తరలించారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏరియాల్లో పోలింగ్ నిర్వహించారు. సింగరేణిలోనే అత్యధిక ఓటర్లు ఉన్న శ్రీరాంపూర్ ఏరియాలో 9,127 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 8,491 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీరాంపూర్ ఓసీలో అత్యధికంగా 96.4 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎస్సార్పీ 1 క్యాంటీన్‌లో 95.2 శాతం, ఎస్టీపీపీలో 95.3 శాతం పోలింగ్ నమోదైంది. బెల్లంపల్లి ఏరియాలో 996 మంది ఓటర్లకు 959 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీపీఏ ఓసీ–2లో, ఖైరిగూడ, సీహెచ్‌పీల్లో 96 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. మందమర్రి ఏరియాలో 4,835 ఓటర్లకు 4,515 మంది ఓట్లు పోలయ్యాయి. ఆర్కేపీ ఓసీపీలో 96 శాతం, ఎస్కే మైన్, కేకే 5, కమ్యూనిటీ హాల్ (పాత సీఐఎస్ఎఫ్ క్యాంపు) కేంద్రాల్లో 95 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే కార్మికులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఫస్ట్ షిప్టులో వచ్చిన వారు ఉదయం, సెకండ్ షిప్టులో వారు మధ్యాహ్నం, నైట్ షిఫ్టు డ్యూటీ చేసిన వారు ఉదయమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

### కౌంటింగ్ ఆలస్యం

రాత్రి 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. భోజనం చేసిన అనంతరం కౌంటింగ్ మొదలు పెట్టారు. అన్ని గనుల నుంచి వచ్చిన పోలింగ్ డబ్బాలను ఏజెంట్లకు చూపించాక సీల్ ఓపెన్ చేశారు. అనంతరం 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టారు. 13 యూనియన్లకు 13 డ్రమ్ములు పెట్టి వారికి వచ్చిన ఓట్లను అందులో వేశారు. అనంతరం కౌంటింగ్ చేశారు. అంతా ముగిసే సరికి అర్ధరాత్రి అయ్యింది. సింగరేణి వ్యాప్తంగా మొత్తం 11 ఏరియాల్లో ఇల్లందులో తొలి ఫలితం వచ్చింది.. 631 ఓట్లు మాత్రమే ఉన్న ఏరియా ఇది. అనంతరం బెల్లంపల్లి, కొత్తగూడెం, కార్పొరేట్ తరువాత అన్నింటికంటే చివరగా శ్రీరాంపూర్ ఫలితం వచ్చింది.


ఓటు వేస్తున్న కార్మికుడు


ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ ఎంపీ బాపురావ్

## అట్టహాసంగా వికసిత్ సంకల్ప యాత్ర ప్రారంభం

ఎదులాపురం, డిసెంబర్ 27 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఎంపీ సోయం బాపురావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. 2047 సంవత్సరం వరకు భారతదేశం వికసితం కావాలంటే మనం అందరం భాగస్వాములం కావాలని కోరారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఉజ్వల పథకం కింద సిలిండర్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.